

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం

06 ఆగస్టు 2025 పేజీలు : 08


### ఆంధ్రప్రదేశ్‌లో భూసార పరీక్ష కేంద్రాలకు మంజూరైన

# నిధులెన్ని ?



నెల్లూరు, మేజర్‌న్యూస్ :

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భూసార పరీక్ష కేంద్రాలకు మంజూరయిన నిధుల వివరాలు తెలపాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. మంగళవారం లోక్‌సభలో ఈ అంశంపై పలు ప్రశ్నలు వేశారు. రాష్ట్రంలో 50 స్టాటిక్ సాయిల్ టెస్టింగ్ ల్యాబ్‌లు, 13 మొబైల్ సాయిల్ టెస్టింగ్ ల్యాబ్‌లు, 1350 మినీ సాయిల్ టెస్టింగ్ ల్యాబ్‌లు, 16 గ్రామ స్థాయి ల్యాబ్‌లు ఉన్నాయన్నది నిజమేనా.. అని వివరాలు కోరారు. ల్యాబ్‌లకు మంజూరు చేయబడిన నిధుల వివరాలు ఆరా తీశారు. పరీక్ష కేంద్రాల్లో చాలా వరకు పని చేయడం లేదని, వాటి పునరుద్ధరణకు తీసుకుంటున్న చర్యలపై వివరాలు కోరారు. ఎంపీ వేమిరెడ్డి ప్రశ్నలకు కేంద్ర వ్యవసాయం, రైతుల సంక్షేమ శాఖ సహాయ మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ సమాధానం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వివరాల ప్రకారం.. రాష్ట్రంలో 47 స్టాటిక్ సాయిల్ టెస్టింగ్ ల్యాబ్‌లు, 13 మొబైల్ సాయిల్ టెస్టింగ్ ల్యాబ్‌లు, 1328 మినీ సాయిల్ టెస్టింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ భూసార పరీక్ష కేంద్రాలకు 2014-15 నుంచి 2025-26 వరకు రూ.64.60 కోట్లు మంజూరు చేస్తే.. ఇందులో రూ.58.43 కోట్లు -మిగతా 2లో

# సర్వేపల్లికి జాతీయస్థాయి గుర్తింపు


- వెంకయ్య నాయుడు ఆశీస్సులతో ప్రతిష్టాత్మక సంస్థల ఏర్పాటు
- అక్షర విద్యాలయంలో చిన్నారుల బంగారు భవిష్యత్తుకు బాటలు
- అక్షర విద్యాలయంలో సీబీఎస్ఈ క్లస్టర్ అథ్లెటిక్స్ మీట్ ప్రారంభం






వెంకటాచలం, మేజర్‌న్యూస్ :

వెంకటాచలం మండలం ఎర్రగుంట సమీపంలోని అక్షర విద్యాలయంలో సీబీఎస్ఈ క్లస్టర్ 7వ అథ్లెటిక్స్ మీట్ 2025-26 ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్వేపల్లి వెమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏపీ, తెలంగాణ నుంచి 2700 మంది విద్యార్థులు, 400 మంది కోచ్‌లు ఈ పోటీలకు హాజరుకావడం గర్వకారణమన్నారు. గతంలోనూ ఖోఖో, బాస్కెట్ బాల్ పోటీలకు అక్షర విద్యాలయం ఆతిథ్యమిచ్చిందన్నారు. ఇక్కడ నిర్వహించిన పోటీల్లో రాణించిన విద్యార్థులు జాతీయ స్థాయి పోటీల్లోనూ పాలుపంచుకున్నారని తెలిపారు. మా పెద్దాయన ముప్పవరపు వెంకయ్య నాయుడు, ఆయన కుమార్తె దీపా వెంకట్ సారథ్యంలో అక్షర విద్యాలయం, స్వర్ణ భారత్ ట్రస్ట్ ఒక బ్రాండ్‌గా నిలుస్తున్నాయన్నారు. జాతీయ స్థాయి సంస్థలకు సర్వేపల్లి నియోజకవర్గాన్ని చిరునామాగా మార్చిన -మిగతా 2లో



ఉదయగిరి, మేజర్‌న్యూస్ :

పట్టణంలోని అగ్రహారంవీధి, కరీమావీధిలో గల రెండు నివాసాల్లో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు ధ్వంసం చేసి రూ.80 వేల నగదు, బంగారం, వెండి వస్తువులను అపహరించిన సంఘటన మంగళవారం చోట చేసుకుంది.

# రెండిళ్లలో చోరీ

రూ.80 వేల నగదు, బంగారు, వెండి వస్తువుల అపహరణ

పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అగ్రహారంవీధికి చెందిన షేక్ అబ్దుల్ షరీఫ్ కుటుంబ సభ్యులతో కలిసి గత శుక్రవారం ఆరుల్లలో జరుగుతున్న గంధమహోత్సవానికి వెళ్లారు. తిరిగి మంగళవారం ఇంటికి చేరుకోగా ప్రధాన ద్వారం తాళాలు ధ్వంసం చేసి ఉండడాన్ని గుర్తించారు. అనంతరం లోపలికి వెళ్లి పరిశీలించగా.. నివాసంలో ఉన్న నాలుగు బీరువాల తాళాలు తీసి అందులో ఉన్న రూ.70 వేల నగదు, -మిగతా 2లో




### విడవలూరు బిట్ - 1 ఎంపీటీసీ స్థానం

# తెలుగుదేశం కైవసం





విడలూరు బిట్ - 1 ఎంపీటీసీగా చలమచర్ల కామేశ్వరమ్మ ఏకగ్రీవ ఎన్నిక

నెల్లూరు, మేజర్‌న్యూస్ :

విడవలూరు బిట్ -1 ఎంపీటీసీగా తెలుగుదేశం పార్టీకి చెందిన చలంచర్ల కామేశ్వరమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏడాది క్రితం ఎంపీటీసీ భవానమ్మ మృతితో విడవలూరు బిట్ - 1 ఎంపీటీసీ నిర్వహించిన ఉప ఎన్నికలో ఓటమి తప్పదని ప్రతిపక్ష వైసీపీ అభ్యర్థిని ప్రకటించలేదు. తెలుగుదేశం పార్టీకి చెందిన చలంచర్ల కామేశ్వరమ్మతోపాటు -మిగతా 2లో

### జర్నలిస్టుల న్యాయమైన కోర్కెలను

# ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం విచారకరం



## కోర్కెల దినోత్సవంలో నాయకులు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** జర్నలిస్టుల న్యాయమైన కోర్కెలను ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడం అత్యంత విచారకరమని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపియుడబ్ల్యుజె) నెల్లూరు జిల్లా ఉపాధ్యాక్షుడు సోమా వెంకట సుబ్బయ్య పేర్కొన్నారు. యూనియన్ రాష్ట్ర కమిటీ ఆదేశాలు, జిల్లా కమిటీ సూచనలతో మంగళవారం ఆత్మకూరులో వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో జర్నలిస్టులు కోర్కెల దినోత్సవం నిర్వహించారు. స్థానిక ఆర్డీవో భూమిరెడ్డి పావనికి వారు ఒక వినతిపత్రం అందజేసి తమ కోర్కెలను, సమస్యలను గురించి వివరించారు. తప్పకుండా ఈ వినతిపత్రాన్ని జిల్లాకలెక్టర్‌కు పంపుతానని, ఆత్మకూరులో ప్రెస్‌క్లబ్‌కు స్థలం కేటాయింపు తాను పరిశీలిస్తానని ఆర్డీవో పావని పేర్కొన్నారు. కార్యాలయ ప్రాంగణంలో వారు తమ కోర్కెలను ఆమోగించాలని, జర్నలిస్టుల ఐక్యత వర్ధిల్లాలని, ఏపియుడబ్ల్యుజె జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు సోమా వెంకట సుబ్బయ్య ప్రసంగిస్తూ అనాదిగా ప్రభుత్వాలు మారుతున్నా జర్నలిస్టుల కోర్కెలు నెరవేరడం లేదన్నారు. సమాజంలో సేవాధృకృధంతో జర్నలిజం వృత్తిలో కొనసాగుతున్న వారంతా ప్రజలేనని, ఓటర్లేనని, వారి కుటుంబ సభ్యులు కూడా ఓటర్లేనని, ప్రజాప్రతినిధులకు వారి ఓట్లు కూడా అవసరమేనని, కాగా అన్ని వర్గాలకు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుంటారు కానీ జర్నలిస్టుల సంక్షేమం పట్ల నిర్లక్ష్యం చేస్తుంటారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో గత పాలకులు 23వేలమంది జర్నలిస్టులకు ఉన్న అక్రిడేషన్లు అసంబద్ధ నిర్ణయాలతో 9 వేలకు కుదించారని, దాంతో అనేక మంది జర్నలిస్టులు హెల్త్‌కార్డులు, బస్‌పాస్‌లు పొందలేక పోయారని ఆయన పేర్కొన్నారు. ప్రస్థుతం ప్రభుత్వం వచ్చి 14 నెలలు గడిచినా కొత్త అక్రిడేషన్లు ఇవ్వకుండా రెన్యువల్‌తో సరిపెడుతున్నారని, ఈ పరిణామం వలన కొత్తగా చేరినవారికి అక్రిడేషన్లు రావడం లేదని, వృత్తినుండి వైదొలగినవారికి కొనసాగుతున్నాయని ఆయనే పేర్కొన్నారు. ప్రస్థుతం రెన్యువల్‌చేయబడిన అక్రిడేషన్ల గడువు ఈనెలాఖరుకు ముగియనుందని, నూతన అక్రిడేషన్ జివోను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వర్కింగ్‌జర్నలిస్టులకు అక్రిడేషన్ ఉంటేనే హెల్త్‌కార్డు సదుపాయం ఉంటుందని, కాబట్టి వెంటనే జివో విడుదల చేయాలని, హెల్త్‌స్కీమ్‌ను సక్రమంగా అమలు చేయాలని, గ్రూప్‌ఇన్సూరెన్స్ అమలుచేయాలని, జర్నలిస్టులు వృత్తినుండి విరమణ అయ్యాక వారికి పెన్షన్ సౌకర్యం కల్పించాలని, అర్హులైన వారందరికి ఆయా మండల లేదా నియోజకవర్గ కేంద్రాల్లో ఇంటి నివేశన స్థలాలు మంజూరు చేసేలా జివో విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర, జిల్లా స్థాయి అక్రిడేషన్ కమిటీల్లో జర్నలిస్ట్ యూనియన్ నాయకులకు ప్రాతినిధ్యం కల్పించాలని ఆయన కోరారు.

కార్యక్రమంలో ఏపియుడబ్ల్యుజె జిల్లా కార్యవర్గసభ్యులు రమణా రెడ్డి, వెంకటేశ్వర్లు, రహమత్‌అలీ, సిహెచ్‌వి. సుబ్బారావు, సినియర్ జర్నలిస్టులు చిట్టెం శ్రీని వాసులు, చాంద్‌బాషా, కరిముల్లా, మూర్తి, వివిద ప్రింట్, ఎలక్ట్రానిక్, యుట్యూబ్ జర్నలిస్టులు సతీష్, రహమత్, ఆనంద్, అక్తర్, పెంచల మోహన్, రమేష్, పార్లపల్లి రవికుమార్‌రెడ్డి, శ్రీనివాసులు, ఆత్మకూరు పట్టణ, ఆత్మకూరు, అనంతసాగరం, ఏఎస్‌పేట, మర్రిపాడు,సంగం మండలాలకు చెందిన జర్నలిస్టులు పాల్గొన్నారు.

# ట్రేడ్ లైసెన్స్‌లపై హెల్త్ ఆఫీసర్ స్పెషల్ డ్రైవ్

**నెల్లూరు, కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై ఓ. నందన్ సూచనల మేరకు మంగళవారం నగరంలోని పొగ తోటలో ఉన్న పలు ప్రముఖ హాస్పిటల్స్‌లకు సంబంధించి ట్రేడ్ లైసెన్స్ మొండి బాకీల వసూళ్లపై నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కనకాద్రి స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. నగరపాలక సంస్థకు చెల్లించవలసిన ట్రేడ్ లైసెన్సులకు సంబంధించి బకాయిలు చెల్లించాలని సూచించారు. లేనిపక్షంలో తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. శానిటరీ సూపర్వైజర్, శానిటరీ ఇన్స్పెక్టర్లు, స్థానిక సెక్రటరీతో కలిసి నెల్లూరు నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కనకాద్రి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.



### కృష్ణపట్నం సొసైటీ వివాదంపై


# రికార్డులు పరిశీలిస్తాం

### ఇరు వర్గాలకు తహసిల్దారు సమాధానం



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** కృష్ణపట్నం సొసైటీ వివాదం పట్ల రికార్డులు పరిశీలిస్తామని మండల తహసిల్దారు స్వప్న అన్నారు. మంగళవారం సాయంత్రం రెవెన్యూ కార్యాలయంలో సొసైటీ సభ్యులు, కావలి దళితవాడ గ్రామస్తులు చర్చలకు హాజరయ్యారు. ఇరు వర్గాలను తహసిల్దారు విచారించారు. సొసైటీ సభ్యులు పరిశ్రమల లోతట్టు ప్రాంతం కూడా ఆక్రమించారని గ్రామస్తులు తెలియజేసుకున్నారు. అధికారుల సమక్షంలో సర్వే చేసి హద్దులు నిర్ణయిస్తామని తహసిల్దారు సమాధానం చెప్పారు. ఈ కార్యక్రమంలో అధికార పార్టీ నాయకులు రాగాల శివకృష్ణ, సొసైటీ సభ్యులు వెంకటేశ్వర్లు, సాయి తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్యం మెరుగుపరచాలి




**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** గ్రామీణ ప్రాంతాల్లో పారిశ్రాన్ని మెరుగుపరిచి అంటువ్యాధుల రాకుండా చూడాలని జిల్లా ఉన్నతాధికారులు ఆదేశించారు. మంగళవారం పిడతా పోలూరు పంచాయతీ కేంద్రంగా చెత్త నుండి సంపద తయారీ కేంద్రం నందు ఇంటి నుండి చెత్త సేకరణ, తడి చెత్త, పొడి చెత్త నిర్వహణపై ఒకరోజు క్షేత్రస్థాయి శిక్షణ కార్యక్రమాన్ని జడ్పీ సీఈవో మోహన్ రావు, డిపిఓ శ్రీధర్ రెడ్డి సంయుక్తంగా ప్రారంభించారు. జిల్లాలోని అన్ని మండలాల ఎంపీడీవోలు తోపాటు డిప్యూటీ ఎంపీడీవోలు, డిఎల్‌డిఓ, డిఎల్‌పిఓ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్పీ సిఈఓ మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని ఆదర్శంగా తీసుకుని అన్ని మండలాలు పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగమణి, పంచాయతీ కార్యదర్శి శేషగిరి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## ఆంధ్రప్రదేశ్‌లో భూసార పరీక్ష కేంద్రాలకు మంజూరైన నిధులెన్ని?

(మొదటి పేజీ తరువాయి)

ఖర్చు చేశారన్నారు. ఇక నెల్లూరు జిల్లాలో 4 ఎస్ఎస్‌టీఎల్‌లు, 1 ఎంఎస్‌టీఎల్, 74 మినీ ఎస్టీఎల్‌లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం 17 ఎస్ఎస్‌టీఎల్‌లు, 13 ఎంఎస్‌టీఎల్‌లు పని చేస్తున్నాయని, 9 ఎస్టీఎల్‌లను పునరుద్ధరించేందుకు 2024-25, ప్రస్తుత సంవత్సరంలో నిధులు మంజూరు చేసి సివిల్ అండ్ ఎలక్ట్రికల్ మరమ్మతు పనుల నిమిత్తం వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు.

## రెండిళ్లలో చోరీ

(మొదటి పేజీ తరువాయి)

నాలుగు బంగారు గాజులు, ఐదు ఉంగరాలు, వెండి వస్తువులను చోరీ చేశారు. అలాగే కరీమావీధికి చెందిన షేక్ హుస్సేనీ కుటుంబం హైదరాబాదులో ఉంటుంది. వారి నివాసంలో సైతం ప్రధాన ద్వారం తాళాలు ధ్వంసం చేసి లోపలికి ప్రవేశించి రూ.10 వేల నగదు, వెండి వస్తువులను అపహరించుకెళ్లారు. సమాచారాన్ని పోలీసులకు అందజేయడంతో ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తన సిబ్బందితో ఆయా నివాసాలకు వెళ్లి పరిశీలించి వివరాలు సేకరించారు. అనంతరం క్లూస్ టీం ఆయా నివాసాల్లో వేలిముద్రలను సేకరించారు. ఈ మేరకు చోరీలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## విడవలూరు బిట్ - 1 ఎంపీటీసీ స్థానం తెలుగుదేశం కైవసం

(మొదటి పేజీ తరువాయి)

మరో ఇండిపెండెంట్ అభ్యర్థిని కూడా నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ ఉపసంహరణ సమయానికి ఇండిపెండెంట్ అభ్యర్థిని నామినేషన్ ఉపసంహరించుకోవడంతో రిటర్నింగ్ అధికారులు మోహన్ రావు, సూర్య కుమారులు కామేశ్వరమ్మ ఏకగ్రీవ ఎన్నికను ధృవీకరిస్తూ డిక్లరేషన్ ఫామ్ అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీగా ఎన్నికైన చలంచర్ల కామేశ్వరమ్మ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి నాయకత్వంలో విడవలూరు అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. తన ఎన్నికకు కృషి చేసిన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆమె ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీగా ఎన్నికైన చలంచర్ల కామేశ్వరమ్మకు టిడిపి నాయకులు సత్యంరెడ్డి, మాతూరు శ్రీనివాసులు రెడ్డి, బెజవాడ గోవర్ధన్‌రెడ్డి అభినందనలు తెలియజేశారు.

## సర్వేపల్లికి జాతీయ స్థాయిలో గుర్తింపు




(మొదటి పేజీ తరువాయి)

ఘనత వెంకయ్యానాయుడు దేనన్నారు. ప్రస్తుతం మళ్లీ ఎన్‌సీఈఆర్‌టీని మన ప్రాంతా నికి తెచ్చారన్నారు. రూ.900 కోట్లతో ఈ సంస్థ ఏర్పాటు కాబోతోందని, మొదటి దశలో రూ.300 కోట్లతో పనులు ప్రారంభం కాబోతున్నాయన్నారు. స్వర్ణ చతుర్భుజి పథకంలో భాగంగా దేశంలోనే మొదటిసారిగా నెల్లూరు - చెన్నై మధ్య జాతీయ రహదారిని నిర్మింపజేసిన గొప్పతనం కూడా ఆయనదేనన్నారు. ఆ ప్రాజెక్టుకు కూడా మన వెంకటాచలంలోనే శ్రీకారం చుట్టారన్నారు. దీపమ్మ సారథ్యంలో నడుస్తున్న అక్షర విద్యాలయంలో చదువుకుంటున్న చిన్నారులు అదృష్టవంతులన్నారు. మంచి మనస్సు కలిగిన వెంకయ్య నాయుడు ఆశీస్సులు విద్యార్థులందరికీ ఉంటాయని మనస్ఫూర్తిగా తెలియజేశారు.



# మహిళలు ఉచిత ప్రయాణ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

**కావలి, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15వ తేదీ నుండి ప్రారంభిస్తున్న మహిళల ఉచిత ప్రయాణం పథకం ప్రతీ ఒక్క ఆర్టీసీ ఉద్యోగి కృషి చేయాలని, మహిళలు కూడా సద్వినియోగం చేసుకోవాలని ఎపియస్ ఆర్టీసీ కావలి డిపో మేనేజర్ డి.ఆదినారాయణ తెలిపారు. మంగళ వారం ఆర్టీసీ గ్యారేజ్ నందు ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ జరిగింది. ఈ కార్యక్రమంలో జులై మాసంలో తమకు కేటాయించిన లక్ష్యాన్ని సాధించిన ముగ్గురు కండక్టర్లకు నగదు బహుమతులు అందజేశారు. 115శాతం సాధించిన సిహెచ్ విజయకుమారి, 108శాతం సాధించిన యం రాజశేఖర్, 105శాతం సాధించిన కేవీ శేషమ్మలకు డిపోమేనేజర్ నగదు బహుమతులు అందజేశారు. ప్రతీ ఉద్యోగి వీరిని ఆదర్శంగా తీసుకుని సంస్థ ఆదాయం పెంపుదలకు కృషి చేయాలని, ఇద్దరు మహిళా కండక్టర్లు విజయ కుమారి, శేషమ్మ, క్యాన్సర్ చికిత్స చేయించు కుంటూనే తన లక్ష్యాన్ని సాధించిన రాజశేఖర్ లు




ఆదర్శప్రాయులని అయన వివరించారు. అదేవిధంగా డ్రైవర్లు ఇందనపొదుపుకు కృషి చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్న మహిళలకు ఉచిత ప్రయాణం కార్యక్రమం విజయవంతానికి అంకితభావంతో పనిచేయాలని అన్నారు. మెకానిక్ సోదరులు మహిళా ప్రయాణికుల రద్దీని తట్టుకునే విధంగా బస్సులను సిద్ధం చేస్తున్నారని అభినందించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) ఎం.కల్పన, అసిస్టెంట్ ఇంజనీర్ (మెకానికల్) యస్కె ఖాజా మొహిద్దీన్, ట్రాఫిక్ సూపరింటెండెంట్ ఎం.రామకృష్ణ, సిస్టం సూపెర్వైసర్ టి.శివశంకర ప్రసాద్, మెకానికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఇంట్లో చోరీ కేసులో వ్యక్తి అరెస్టు



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ పరిధిలోని జీవీఆర్ఆర్ కాలేజీ ఎదురుగా ఉన్న ఖాన్ ప్రాపర్టీస్ ఆఫీస్ నందు గత శుక్రవారం 50 గ్రాముల బంగారం, 50వేల నగదుని దొంగలించిన వ్యక్తిని, అతనితోపాటు మైనర్ బాలుడిని అధువులోకి తీసుకున్నట్లు వేదయపాలెం సీఐ కే.శ్రీనివాసరావు మంగళవారం తెలియజేశారు. వివరాల్లోకి వెళితే.. 01-08-2025ను ఖాన్ ప్రాపర్టీస్ ఆఫీస్‌లో గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగలగొట్టి ఎనిమిది గ్రాములు చైన్, 15 గ్రాముల కమ్మలు, నాలుగు గ్రాముల మాటీలు, 17 గ్రాముల నెక్లెస్, 6 గ్రాములు లాకెట్ మొత్తం 1,50000/-విలువచేసే బంగారు ఆభరణాలు, 50వేల నగదు దొంగలించారని పటాన్ జలీల్ భాషా ఐదో నగర పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన వేదయపాలెం పోలీసులు. దర్యాప్తులో భాగంగా మంగళవారం మధ్యాహ్నం నెల్లూరు రూరల్ పరిధిలోని గొలగమూడి క్రాస్ రోడ్స్ వద్ద నిందితుడు పటాన్ అఫ్రఫ్ ఖాన్(20) కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డ్, మైనర్ బాలుడును అరెస్ట్ చేసి వారి దగ్గర నుంచి దొంగలించబడ్డ బంగారం, ఏపీ40 బిజీ 9415 నెంబర్ గల బైకును స్వాధీనం చేసుకొని వారిని కోర్టుకు హాజరు పరిచినట్లు వేదయపాలెం పోలీస్ స్టేషన్ సీఐ తెలియజేశారు. కేసును చేదించడంలో ప్రతిభ కనబరిచిన ఎస్ఐ నవీన్, వారి సిబ్బందిని డీఎస్పీ ఈ సందర్భంగా అభినందించారు.

# సముద్ర శైవల సాగుతో పర్యావరణం పరిరక్షణ, ఆదాయ మార్గాలు

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** సముద్ర శైవల సాగు చేయడం వల్ల పర్యావరణ పరిరక్షణ తో పాటు ఆదాయ మార్గాలు ఉంటాయని ప్రభుత్వ అధికారులు అన్నారు. మంగళవారం కృష్ణపట్నం గ్రామంలోని సాయిబాబా ఆలయ సమావేశ మందిరం నందు అర్కాటి పాలెం, రాంనగర్ గ్రామాలకు సంబంధించిన మహిళలకు ఈ అంశం పట్ల అవగాహన కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. మత్స్యశాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సంయుక్తంగా చేపట్టిన కార్యక్రమానికి గ్రామస్తులు కూడా హాజరయ్యారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగరాజా కుమారి, అసిస్టెంట్ డైరెక్టర్ చాన్‌భాష, ఫిషరీస్ డెవల ప్మెంట్ ఆఫీసర్ పూజిత, వెలుగు ఏపిఎం నిర్మల విచ్చేశారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. మహిళలకు ఎంతగానో ఉపాధి




కల్పిస్తుందని తెలియజేశారు. మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ చాన్ భాష మాట్లాడారు. మత్స్య వేటకు ప్రత్యామ్నాయ ఆదాయ మార్గంగా ఉందన్నారు. సముద్ర శైవలుఅంటే ఏమిటి, శైవల సాగు ఎందుకు చేయాలి, సముద్ర శైవల జాతుల ప్రధాన వర్గీకరణ, సాగుకు అనువైన ముఖ్యమైన శైవలజాతులు, ఎలా సాగు చేయాలి, అవసరమైన పదార్థాలు, మార్కెట్ అవకాశాలు, ప్రభుత్వ సహాయం శిక్షణ తదితర అంశాల గురించి ఆయన సమగ్రంగా వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామ సచివాలయాల మత్స్య సహాయకులు, గ్రామ కాపులు పాల్గొన్నారు.

## త్వరలో ప్రజా సమస్యలపై పాదయాత్ర : జనసేన నేతలు

**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** ప్రజల సమస్యలపై త్వరలో పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు ఆత్మకూరు నియోజకవర్గం జనసేన పార్టీ ఉపాధ్యక్షులు కంటే శ్రీనివాస్ భరత్, అనంతసాగరం మండలం జనసేన పార్టీ అధ్యక్షులు ఉదయగిరి రవి, మండల ఉపాధ్యక్షులు బివి రమణ, నియోజకవర్గ నాయకులు కే.శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఆత్మకూరు జనసేన పార్టీ ఇంచార్జ్ నలిశెట్టి శ్రీధర్ సూచనల మేరకు పాదయాత్ర నిర్వహించి ప్రజల సమస్యలను తెలుసుకొని మండల అధికారులకు, జనసేన పార్టీ అధిష్టానానికి తెలియజేస్తామని అన్నారు. పాదయాత్ర తేదీలను ప్రకటిస్తామని అన్నారు. ప్రతి గ్రామంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామని వివరించారు. ప్రజల సమస్యలను మండల అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే పరిష్కరిస్తామని వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మండల జనసేన పార్టీ గ్రామాలలో ప్రత్యేక స్థానాలపై దృష్టి పెట్టినట్లు వివరించారు.

## సచివాలయానికి ప్రింటర్‌ను అందించిన ఎంపీటీసీ



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు మండలంలోని చినమా చనూరు సెగ్మెంట్ ఎంపీటీసీ తమటం బాల గురవమ్మ కుమారుడు తమటం ఈశ్వర్‌రెడ్డి మంగళవారం అదే పంచాయితీలో ఉన్నటువంటి పొలిరెడ్డి పల్లిలోని సచివాలయానికి ప్రింటర్ను, ఎలక్ట్రికల్ డివైస్‌ను అందించారు. సచివాలయంలో ఈ రెండు వస్తువులు లేక సిబ్బంది ఇబ్బందులు పడుతున్న తరుణంలో సొంత నిధులతో ఆ రెండింటిని ఏర్పాటు చేయడం జరిగింది. అందుకు సంబంధించి సచివాలయ సిబ్బందితో పాటు ఆ సెగ్మెంట్ ప్రజలు ఎంపీటీసీకి అభినందనలు తెలియజేశారు.

## విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం కల్పించాలి

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి పట్టణంలో పేద ఇంటర్, డిగ్రీ విద్యార్థుల సౌకర్యార్థం హాస్టల్ సౌకర్యం కల్పిం చాలని జనవిజ్ఞాన వేదిక. ఎమ్మార్పీఎస్ నాయకులు షేక్ దస్తగిరిఅహ్మద్, గాజులపల్లి రామిరెడ్డి, బెజవాడ బాలగు రవయ్యలు మంగళవారం ఓ సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలో ఉన్న ఎస్సీ, బీసీ బాలుర, బాలికల వసతిగృహాలు మూతపడడంతో పేద విద్యార్థులకు విద్యకు దూరమవుతున్నారన్నారు. మండలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన సుమారు వెయ్యి మంది ఇంటర్, డిగ్రీ విద్యార్థులు ఉన్నారన్నారు. వారికి హాస్టల్ వసతి కల్పిస్తే చదువుకునే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి విద్యార్థుల భవిష్యత్తును. దృష్టిలో ఉంచుకుని హాస్టల్స్ వసతి కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

## రేపటి నుంచి ఆలయ వార్షికోత్సవ వేడుకలు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని కృష్ణంపల్లి గ్రామంలో శ్రీసీతా రామలక్ష్మణ హనుమత్ సమేత రామచంద్రస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు గురువారం నుంచి శనివారం జరుగుతాయని నిర్వాహకులు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం గణపతి పూజ, పున్యహావచనం, అంకురారోపణ, పంచామృతాభిషేకాలు, గ్రామోత్సవం, శుక్రవారం విశేష హెూమాలు, సీతారాముల కల్యాణోత్స వం, గ్రామోత్సవం, శనివారం వసంతోత్సవం, ఉట్టి మహెూత్సవం, పారువేట కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తుల సౌకర్యార్థం అన్నప్రసాద వితరణ, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులవ్వాలని వారు కోరారు.


## అంగన్వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీవో సునీత మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రాజెక్టు పరిధిలోని సీతారామపురం మండలం బెడుసుపల్లి(జనరల్), దుత్తలూరు మండలం నర్రవాడ ఎస్సీ కాలనీ(ఎస్సీ గ్రూపు-3) అంగన్వాడీ కేంద్రాల్లో కార్యకర్తల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అలాగే సీతారామ పురం పట్టణంలోని బెస్తకాలనీ(బీసీ-ఏ), హరిజనవాడ(ఎస్సీ గ్రూప్-2), మండలంలోని గుండుపల్లె(ఓసీ), రౌం పిదొడ్ల ఎస్సీకాలనీ(ఎస్సీ గ్రూపు-2), నెమళ్లదిన్నె (ఓసీ), పోలంగారిపల్లి(ఓసీ), ఉదయగిరి పట్టణంలోని ఎస్సీ కాల నీ(ఎస్సీ గ్రూపు-2), సినిమాహాలువీధి(బీసీ-ఈ), వరికుంటపాడు మండలంలోని పెద్దిరెడ్డిపల్లి మెయిన్(ఓసీ), ఆం డ్రావారిపల్లి(ఓసీ) అంగన్వాడీ కేంద్రాల్లో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. 10వ తరగతి పాసై, ఈ ఏడాది జూలై 1వ తేదీ నాటికి 35 సంవత్సరాలలోపు వయసు కలిగి ఉండాలన్నారు. అర్హులైన వారు ఈనెల 26వ తేదీలో దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

## విధుల్లో అలసత్వం వహించరాదు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** వైద్యఆరోగ్య సిబ్బంది విధుల్లో అలసత్వం వహించకుండా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి వినీత పేర్కొన్నారు. మంగళవారం పాత సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యఆరోగ్య సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సం దర్భంగా ఆమె మాట్లాడుతూ.. సిబ్బందికి కేటాయించిన లక్ష్యాలను అధిగమించాలన్నారు. యాప్లనందు సమగ్ర సమాచారాన్ని పొందుపర్చాలన్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వారికి అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం సిబ్బందికి మందులు, ఇంజక్షన్లు పంపిణీ చేశారు.

# సీపీఎం ఆధ్వర్యంలో విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** విద్యుత్ ప్రైవేటీ కరణలో భాగంగా విద్యుత్ వినియోగదారులకు స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని వ్యతిరేకిస్తూ సిపిఎం నెల్లూరు రూరల్ మండల కమిటీ ఆధ్వర్యంలో నెల్లూరు రూరల్ మండలంలోని సౌత్ మోపూర్ గ్రామంలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించడం జరిగినది. ధర్నాలో పాల్గొన్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆలూరు తిరుపాలు మండల కార్యదర్శి పూడిపర్తి జనార్దన్లు మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలను తగ్గిస్తామని 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు ఇస్తామని హామీ ఇచ్చి నేడు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా వివిధ రూపాలలో ఫిక్స్డ్ చార్జీలు కస్టమర్ చార్జీలు సర్ చార్జీలు రకరకాల పేర్లుతో 12771 కోట్ల రూపాయల విద్యుత్ చార్జీలు పెంచే విధానాన్ని ప్రవేశపెట్టారు. రైతులకు ఉచిత విద్యుత్తు కు ఎసురు పెడుతున్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఇస్తున్న రాయితీలకు కోత పేడుతున్నారు. రైతులకు వ్యవసాయ పంపు సెట్లకు, గృహ వినియోగదారులకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు పెట్టడానికి టెండర్లు పిలిచి అదాని లాంటి కార్పొరేట్లకు కట్టబెట్టాలని చూస్తున్నారు. దీనితో వినియోగదారులు ముందుగానే విద్యుత్ బిల్లును చెల్లించే ప్రీపెయిడ్ విధానం ప్రవేశపెడుతున్నారు. భవిష్యత్తులో విద్యుత్ రంగాన్ని పూర్తిగా కార్పొరేట్ల కబంధహస్తాలకు కట్ట పెట్టాలని చూడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తక్షణమే పెంచిన విద్యుత్ చార్జీల భారాలను తగ్గించాలనీ, స్మార్ట్ మీటర్ల పెట్టడాన్ని నిలిపివేయాలని విజ్ఞప్తి చేసారు. అనంతరం సబ్ స్టేషన్ లోని షిఫ్ట్ ఆపరేటర్‌కి వినతి పత్రం అందించడం జరిగింది. కార్యక్రమంలో సిపిఎం రూరల్ మండల కమిటీ సభ్యులు ఎంవి రమణ, జానాలక్ష్మి ప్రసాద్, పర్చూరు ప్రభాకర్, పాదర్తి మస్తానయ్య, షైక్ అబ్దుల్లా, గడ్డం వెంకటేశ్వర్లు,బాలు ఆదిశే షయ్య పేరతూరు నాగరాజు, మనోజ్ పసల వెంకట రమణయ్య, కోటపూడి సుబ్రహ్మణ్యం, గంగాల వెంకటరమణయ్య, జడ వెంకటేశ్వర్లు, బద్దిపూడి వెంకటసుబ్బయ్య, కామాక్షయ్యలు పాల్గొన్నారు.

# పొలాలకు వెళ్లే దారి సమస్యపై ఎమ్మెల్యేకు చెబుతాము



## పంటపాలెం రైతులకు అధికార పార్టీ అధ్యక్షుడు నీలం హామీ

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** సాగరమాల ప్రాజెక్టు కు సంబంధించిన నేషనల్ హైవే రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతూ మిగిలి భూమికి దారి సమస్య ఎదుర్కొంటున్న రైతుల సమస్యలను సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్తామని మండల అధికార పార్టీ అధ్యక్షుడు నీలం మల్లికార్జున యాదవ్ రైతులకు హామీ ఇచ్చారు. మంగళవారం స్థానిక సాగర మాల ప్రాజెక్ట్ జాతీయ రహదారి భూముల బాధితులు ఆహ్వానం మేరకు పార్టీ అధ్యక్షులు నీలం కోళ్ల మిట్ట వద్ద రైతులతో కలిసి భూములు పరిశీలించారు. స్థానిక అధికార పార్టీ నాయకులు తిన్నెలపూడి సిద్దు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. రహదారి వెంబడి నిర్మిస్తున్న డ్రైనేజీ కాలువ వద్ద మిగులు పొలాల్లోకి రైతులు వెళ్లి వ్యవసాయం చేసుకునేందుకు ఎటువంటి దారి మార్గం లేకపోవడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎత్తయిన డ్రైనేజీ కాలువ ఎక్కి పొలాల్లోకి మేము దిగితే ప్రాణాలు ఉంటాయా అంటూ కన్నీళ్లు పెట్టుకున్నారు. వ్యవసాయానికి అనుకూలంగా దారి చూపెట్టాలని రైతులు పార్టీ అధ్యక్షులునీలం వద్ద వాపోయారు. తీసుకుంటున్న భూమికి కూడా మార్కెట్ విలువ ప్రకారం ధర చెల్లించకుండా తక్కువ ధర ఇచ్చేందుకు సాగరమల ప్రాజెక్టు అధికారులు రైతులను మోసం చేస్తున్నారని రైతులుఅన్నారు. నేషనల్ హైవే అథారిటీ అధికారులకు రైతులు చెప్పినప్పటికీ నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారని రైతులు అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వం న్యాయం చేయాలని వేడుకున్నారు. కార్యక్రమంలో రైతులు వెడిచెర్ల వెంకటమ్మ, వెడిచర్ల ప్రసాద్, తిన్నెలపూడి వెంకట శేషయ్య, వెడి చర్ల ఏడుకొండలు, వెడి చర్ల వెంకయ్య, వెంపులూరు సీతా లక్ష్మి, వెంపులూరు బుజ్జమ్మ, నారా విజయలక్ష్మి, నారా జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని వెంగళరావునగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేస్తూ ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో ఇతర మండలాలకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు మంగళవారం పాఠశాలలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ 1 టి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగ వృత్తిలో బదిలీలు సర్వసాధారణమన్నారు పనిచేసే చోట విద్యాభివృద్ధికి పాటుపడాలన్నారు. అనంతరం బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు షేక్ నూర్జహాన్ కేసి మాలకొండయ్య డి.వెంగళరావు ఎల్ఏవివిఎస్ భగవాన్ శాస్త్రి షేక్ షబానా షేక్ రఫీలను సన్మానించారు. కార్యక్రమంలో ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయుడు రమేష్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# వాట్సాప్‌గవర్నెన్స్ పట్ల అవగాహన కార్యక్రమం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలం వెన్నవాడలో మంగళవారం ప్రభుత్వం రూపొందించిన వాట్సాప్ గవర్నెన్స్, వాట్సాప్‌మిత్ర గురించి ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి కిషోర్ ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ చేసి ప్రజలకు ఈ రెండింటి గురించి కలిగెడి ప్రయోజనాలు, సౌకర్యం గురించి అవగాహన కల్పించారు. వాట్సాప్‌గవర్నెన్స్. వాట్సాప్‌మిత్ర యాప్‌ల వినియోగం గురించి కూడా వారు వివరించారు. ఈకార్యక్రమంలో పంచాయతీ వార్డు మెంబర్, నియోజకవర్గ జనసేన నాయకుడు పసుపులేటి శ్రీరామ్, నాయకులు దిశించర్ల మాధవ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కలిశెట్టి రవీంద్రబాబు, నరశింహ, సచివాలయ సిబ్బంది రుచిత, శ్రీను, అభినయ, విద్యార్ధులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# సహా చట్టంపై అవగాహన పెంచుకోవాలి

- సామాజక వేత్త మాలకొండా రెడ్డి



**జలదంకి, మేజర్‌న్యూస్ :** సమాచార హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి అవనీతి ని నియంత్రించాలని లోక్సత్త ఉద్యమ సంస్థ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం మాలకొండారెడ్డి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.ప్రజాస్వామ్యం లో అధికారం సొమ్ము ప్రజల దని పాలనా సమాచార హాక్కు ప్రజల ప్రాథమిక హక్కు అని పోరాడి సాధించుకున్నారన్నారు. 2005 లో కేంద్ర ప్రభుత్వం ఈ సహా చట్టాన్ని తీసుకోరావడం జరిగింది అన్నారు ఈ చట్టం అమలు చేసి 19 సంవత్సరాలు అయిందని తెలిపారు ఈ సహ చట్టం ప్రకారం సెక్షన్ 4, 1బి ప్రకారం ప్రతి ప్రభుత్వ కార్యాలయం దగ్గర ఈ సమాచారాన్ని అందుబాటులో ఉంచాలన్నారు. అడిగిన సమాచారాన్ని పోరులకి 30రోజుల్లో ఇవ్వాలన్నారు నిర్లక్ష్యం చేసిన, జాప్యం చేసిని 25000 ల రూపాయల వరకు అపరాధ రుసుము వేయొచ్చు అన్నారు. ఈ చట్టం అమలు జరపడం వలన పరిపాలనలో పారదర్శకత్వం ఏర్పడి అవినీతిని నియంత్రించి ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయన్నారు.

# ముర్రుపాలు బిడ్డకు మొదటి టీకా..



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించాలని, ముర్రుపాలు బిడ్డకు మొట్టమొదటి వ్యాధి నిరోధక టీకా అని అంగన్వాడి సూపర్వైజర్ సిహెచ్ ఆదినారాయణమ్మ అన్నారు. పొదలకూరు మండలంలోని నేదురుపల్లి అంగన్వాడి కేంద్రంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బిడ్డకు మొదటి ఆరు నెలలు కేవలం తల్లిపాలు మాత్రమే పట్టించాలని అన్నారు. ఆరు నెలల తర్వాత అనుబంధ పోషకాహారం అందించాలని సూచించారు. ప్రతి ఒక్క గర్భవతి ప్రసవం అయిన వెంటనే బిడ్డకు ఏ విధంగా పాలు పట్టించాలని విషయమై ప్రదర్శన రూపంలో తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు ఏ నాగలక్ష్మి కుమారి, పి.నర్మద, సిహెచ్ విమలాకుమారి, టి.సుమ, ఎంఎల్‌హెచ్ పి.ప్రసన్న, ఆశ వర్కర్ ఎం.పెంచలమ్మ, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.

# సెల్ ఫోన్లపై అంగన్వాడీల ఆందోళన



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** అంగన్వాడీ కార్యకర్తలపై వ్యాపారం అధికమైందని సిఐటియు నాయకులు కోడె రమణయ్య ఆరోపించారు మంగళవారం స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ కార్యకర్తలతో కలిసి ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం పంపిణీ చేసిన సెల్ఫోన్లు చేయక కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు అంగన్వాడీ కేంద్రాల కార్యకలాపాలను యాప్లో నమోదు చేయాలి. అయితే అందుకు నెట్టు సక్రమంగా అందక సెల్ఫోన్లు సరిగా పని చేయక వారి అవస్థలు వర్ణతీతంగా మారాయన్నారు కార్యకర్తలకు వ్యాపారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. 5జి ఫోన్లు ఇచ్చేవరకు ఆన్లైన్లో వర్క్ చేయమని ఆఫ్‌లైన్‌లో రికార్డ్ వర్క్ చేస్తామన్నారు అనంతరం సెల్ఫోన్లను సిడిపిఓ ఒక అప్పగించారు ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎల్ఆర్ఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి : మేయర్ స్రవంతి

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అనధికార లేఔట్ లో ప్లాట్ల యజమానులకు చట్ట బద్ధహక్కులు కల్పించే ఎల్ఆర్ఎస్ పథకం అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మేయర్ స్రవంతి జయవర్ధన్ సూచించారు. కార్పొరేషన్ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో "నక్ష సర్వే ప్రోగ్రాం, ఆంధ్రప్రదేశ్ అనధికార లే అవుట్లు - ప్లాట్ల క్రమబద్ధీకరణ" అంశాలపై ప్రజాప్రతినిధులు, ఎల్టిపీలు, బిల్డర్లకు అవగాహన సదస్సును టౌన్ ప్లానింగ్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ అనధికార లేఔట్ లోని ప్లాట్ల యజమానులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం క్రమబద్ధీకరణ పథకం ఎల్ఆర్ఎస్ 2020ను సవరిస్తూ ప్రభుత్వం తాజాగా జీవో నెంబర్ ఎంఎస్‌నెం 134 రు, తేదీ 26-07-25 ప్రకారం ఉత్తర్వులను జారీ చేసిందని తెలిపారు. తాజా ఉత్తర్వుల ప్రకారంగా ఈ ఏడాది జూన్ నెల 30 వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ ద్వారా కొనుగోలు చేసిన ప్లాట్లు క్రమబద్ధీకరణకు అర్హత కలిగి ఉన్నాయని తెలిపారు. 90 రోజుల గడువు పరిమితిలో అనగా తేదీ 24.10.25 లోపు క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోవాలని మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్న వారు ఓపెన్ స్పేస్ చార్జీలపై 50 శాతం రాయితీ పొందుతారని, 45 రోజుల లోపు మొత్తం ఫీజు చెల్లిస్తే, పెనాల్టీ చార్జీలపై 10 శాతం తగ్గింపు, 90 రోజుల్లోపు మొత్తం ఫీజు చెల్లిస్తే పెనాల్టీ పై 5% తగ్గింపును పొందుతారని వివరించారు. ఎల్.ఆర్.ఎస్ పథకంపై అవగాహన కల్పించేందుకు, సందేహాలు, వివరణలు అందించేందుకు టౌన్ ప్లానింగ్ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేకంగా 0861- 2316777 హెల్ప్ లైన్ నంబరును సంప్రదించాలని సిటీ ప్లానర్ హిమబిందు సూచించారు.



## నక్ష కార్యక్రమంపై అవగాహన పెంచుకోండి

భారత ప్రభుత్వం, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖలోని భూముల వనరుల విభాగం ద్వారా, నగర ప్రాంతాలలో భూముల సర్వేను ఆధునికంగా, సాంకేతికంగా డిజిటల్ విధానంలో నిర్వహించడానికి నక్ష పేరుతో ఒక వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించిందని, ప్రజల స్థిరాస్తులకు ఎంతో ప్రయోజనం చేకూర్చే నక్ష సర్వే నిర్వహణలో బృందాలకు ప్రజలంతా సహకరించాలని మేయర్ స్రవంతి జయవర్ధన్ కోరారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. నక్ష సర్వే కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 157 పట్టణ స్థానిక సంస్థలు ను పైలట్ ప్రాజెక్టులుగా ఎంపిక చేయగా, అందులో ఆంధ్రప్రదేశ్‌లోని 10 పట్టణ సంస్థలు ఎంపికయ్యాయని, వాటిలో నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్ ఒకటి కావడం గర్వకారణమని ప్రకటించారు. నక్ష కార్యక్రమంలో జిఐఎస్ డ్రోన్ సాంకేతికత ఆధారంగా జరిగే సర్వే ద్వారా ఖచ్చితమైన, జియో-రెఫరెన్స్ చేయబడిన, నవీకరించబడిన భూ రికార్డులను నమోదు చేయగలమని తెలిపారు. పట్టణ ప్రణాళిక, అభివృద్ధి, మౌలిక సదుపాయాల నిర్ణయాలకు తోడ్పాటును అందించి పౌరుల ఆస్తి రికార్డులు, పన్నులలో పారదర్శకత, సమర్థతలను కలిగివుంటుందని వివరించారు. ప్రభుత్వ భూముల ఆక్రమణ నుండి రక్షణ కల్పిస్తూ ప్రజల సౌకర్యం, ఈ-గవర్నెన్స్ సేవలకు మద్దతుగా నిలుస్తుందని తెలిపారు. సర్వే బృందాలు గుర్తింపు పత్రాలతో మీ ప్రాంతాలను సందర్శిస్తారని, నెల్లూరు నగర ప్రజలు, ఆస్తి యజమానులు, పౌరులు సర్వే బృందాలకు సహకరించి, తమ భూముల వివరాలను, సంబంధిత పత్రాలను సరైన రూపంలో సమర్పించాలని మేయర్ విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఈ సర్వే కార్యక్రమం ద్వారా పౌరులకు ఆస్తి హద్దులపై యాజమాన్య స్పష్టత కల్పిస్తుందని, ఆస్తి వివాదాలు చట్టపరమైన సమస్యలను నివారించడానికి ఉపయుక్తంగా ఉంటుందని సిటీ ప్లానర్ హిమబిందు వివరించారు. సర్వే ద్వారా సేకరించిన వివరాలను డిజిటల్ రూపంలో నిక్షిప్తం చేసి, ఆయా భూ రికార్డులకు ప్రాధాన్యత కల్పించనున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ కో ఆప్షన్ మెంబర్లు చాట్ల నరసింహారావు, షేక్ జమీల్, కార్పొరేటర్లు కర్తం ప్రతాప్ రెడ్డి, పొట్లూరి రామకృష్ణ, శ్రీకాంత్ రెడ్డి, నాయకులు గణేశం వెంకటేశ్వర్లు, శ్రీధర్,సిటీ ప్లానర్ హిమబిందు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ మురళి, టిపిఓ సతీష్ కుమార్, టౌన్ ప్లానింగ్ విభాగం ఇన్ చార్జి సూపరింటెండెంట్ కృష్ణ కిషోర్ బిల్డర్లు, లైసెన్స్డ్ టెక్నికల్ పర్సన్స్, టీ.పీ.బి.వోలు, వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# తల్లిపాలు బిడ్డకు శ్రేష్టం : ఐసీడీఎస్ సూపర్‌వైజర్

**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** తల్లిపాలు బిడ్డకు అత్యంత శ్రేష్టమని ఏఎస్ పేట మండలం అనుమ సముద్రం సెక్టార్ ఐసిడిఎస్ సూపర్వైజర్ జి కస్తూరి పేర్కొన్నారు మంగళవారం ఏఎస్పేట మండలం రాజవోలు, సచివాలయంలో తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ జి.కస్తూరి మాట్లాడుతూ.. ముర్రుపాలు బిడ్డకు పరమ శ్రేష్టమని అత్యంత ప్రయోజనకరమని వ్యాధి నిరోధక శక్తిని పెంపొందిస్తాయని పేర్కొన్నారు తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా రాజవోలు 2 అంగన్వాడీ కేంద్రంలో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు పౌష్టికాహార ప్రదర్శనను పరిశీలించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ కస్తూరి ప్రసంగిస్తూ తల్లిపాలు బిడ్డలకి అత్యంత ఆరోగ్యకరమని రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తాయని మహిళలం దరూ ప్రధానంగా గర్భిణీలు బాలింతలు విషయాన్ని గమనించాలని అవగాహన పెంపొందించుకోవాలని వారిలో తగిన చైతన్యం పెంపొందాలని వివరించారు. ప్రతి సంవత్సరం లాగే ఈసారి కూడా జిల్లా ఐసిడిఎస్ పిడి ఆదేశాల మేరకు అందరికీ తల్లిపాల ప్రాధాన్యతను గురించి అవగాహన పెంపొందించేలా తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమం తమ ప్రాజెక్టు



పరిధిలో వాడవాడల్లా నిర్వహిస్తామన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే గంటలోపు తల్లి ముర్రుపాలు బిడ్డలకు ఇస్తే ఎంతో ప్రయోజనకరమని రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. పుట్టిన బిడ్డలకు ఆరు నెలల వరకు తల్లి పాలిస్తే అత్యంత శ్రేష్టం ఆరోగ్యవంతమని పేర్కొన్నారు. తల్లి గర్భిణీ సమయంలో తగినంత పోషక విలువల గల ఆహారం తీసుకుంటే బిడ్డలకు సమృద్ధిగా పాలు లభిస్తాయని పేర్కొన్నారు. తల్లిపాలు బిడ్డలకు అమృతం లాంటివని కూడా పేర్కొన్నారు. మహిళలందరూ తప్పకుండా తల్లిపాలు ప్రాధాన్యత గుర్తించి అవగాహన పెంపొందించుకోవాలని తెలియజేశారు. తల్లిపాలు బిడ్డకు ఇవ్వటంతో బిడ్డ ఆరోగ్యంగా ఉండటమే కాకుండా తల్లి కూడా ఆరోగ్యంగా ఉంటుంది తల్లి బిడ్డకు పాలు ఇవ్వడం వల్ల తల్లికి రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ వచ్చే ప్రమాదం తప్పుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తల్లిపాల వారోత్సవాలతో పాటు గర్భిణీలకు సీమంతాలు కూడా జరపడం జరిగింది. ఈ కార్యక్రమంకు ఐసిడిఎస్ సూపర్వైజర్ జి కస్తూరితోపాటు జిఎం ఎస్‌కే, అంగన్వాడి కార్యకర్తలు జి.మహేశ్వరి, ఎస్కే హసీనా, ఎం.కామాక్షమ్మ, ఎన్.వజ్రమ్మ, ఎన్ వనజ, ఎన్వి సుభాషిని, ఓ సంపూర్ణ పాల్గొన్నారు.

## స్మార్ట్ మీటర్ల వల్ల భవిష్యత్తులో తీవ్ర నష్టాలు



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** స్మార్ట్ మీటర్లు బిగించడం వల్ల వినియోగదారులు భవిష్యత్తులో తీవ్ర నష్టాలను చూడవలసి వస్తుందని జిల్లా రైతు సంఘం అధ్యక్షులు పులిగండ్ల శ్రీరాములు పేర్కొన్నారు. బుచ్చిరెడ్డిపాలెం పట్టణ పరిధిలోని సబ్ స్టేషన్ వద్ద పట్టణ కార్యదర్శి పోతంశెట్టి శ్రీనివాసులు ఆధ్వర్యంలోమంగళవారం ఆ పార్టీ నాయకులు నిరసనలు చేపట్టి ధర్నా నిర్వహించగా ముఖ్యఅతిథిగా పులిగండ్ల శ్రీరాములు పాల్గొని స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ సబ్ స్టేషన్ ఏఈకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పులిగండ్ల శ్రీనివాసులు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లను అదాని కంపెనీ వారు తయారు చేసి ప్రజలపై భారం మోపి లాభాలు పొందుతున్నారన్నారు. గతంలో స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టండి ఏంజరిగినా నేను చూసుకుంటానని నారా లోకేష్ భరోసా ఇచ్చారు. ఇప్పుడు ఆయనే ముందుకు వచ్చి వాటిని బిగించేందుకు అనుమతులను ఇవ్వడం హాస్యంగా ఉందన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించడం వల్ల భవిష్యత్తులో వినియోగదారులు తీవ్ర నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ప్రజలే ఆలోచించి స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జొన్నలగడ్డ వెంకమరాజు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నారా చంద్రబాబు గతంలో ఉన్న కరెంటు బకాయిలను ప్రజలపై ట్రూ అప్ చార్జీల పేరిట వసూలు చేస్తున్నారన్నారు. అదాని కంపెనీ వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమ్ముడుపోయి ప్రజలను అమాయకులను చేసి స్మార్ట్ మీటర్ల రూపంలో లాభాలు పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి గండవరపు శ్రీనివాసులు, ఎస్కే జానీ బాషా జిల్లా అవాజ్ ఉపాధ్యక్షులు, ఎస్కే మునీర్ అహ్మద్ ఆవాజ్ బుచ్చి మండల కార్యదర్శి, గరికపాటి సురేష్, సిపిఎం మండల సభ్యులు, రైతులు, సిఐటియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అడిషనల్ డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీ



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం అడిషనల్ డిఎంహెచ్ఓ డాక్టర్ ఎస్కే ఖాదరవల్లి ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ప్రస్తుతం జరుగుతున్నటువంటి టీబీ ముక్త భారత్ భాగంగా క్షయ వ్యాధి కేసుల నోటిఫికేషన్ లక్ష్యాలను మరియు క్షయ అనుమానితులను గుర్తించి వారికీ నూరు శాతం పరీక్షలు నిర్వహించి లక్ష్యాలను అందరు చేరుకోవాలని ఆయన సిబ్బందికి సూచించారు. అలాగే ప్రతి ఒక్కరూ వారి పరిధిలో ఉండే టీబీ కేసులను గుర్తించి చికిత్సలు పూర్తి అయ్యేవరకు గమనించాలి అని తెలియజేశారు. అలాగే టీబీ ముక్త్ భారత్ జరుగు సర్వేన కూడా పూర్తిస్థాయిలో నిర్వహించి నివేదికను అందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి గోపీనాథ్, డీపీసీ విజయ్ ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు ప్రత్యేక గ్రీవెన్స్ డే కార్యక్రమం

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** తహసిల్దార్ కార్యాలయావరణలో బుధవారం ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తాసిల్దార్ రామ్మోహన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆత్మకూరు ఆర్డీవో పావనీలు పాల్గొనున్నారు. ఈ అవకాశన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి



విజయమూరు, మేజర్‌న్యూస్ : విజయమూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్తలు సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్లు సిడిపిఓ పద్మజా కుమారి తెలిపారు. వింజమూరు ప్రాజెక్టు పరిధిలో 11 అంగన్వాడీ కార్యకర్తలు 12 అంగన్వాడి సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆమె తెలిపారు వింజమూరు మండలం రావిపాడు అంగన్వాడి ఓసి వింజమూరు బీసీ కాలనీ బీసీఏ అంగన్వాడి సహాయకుల వివరాలు చాకలకొండ బీసీ కాలనీ బీసీఏ వింజమూరు వివర్స్ కాలనీ బీసీ బి పాతూరు ఓసి నల్లగొండ ఎస్టి మాధవ్ నగర్ ఎస్టీ వింజమూరు మండలంలో రెండు కార్యకర్తలు నాలుగు సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు ఈ పోస్టులకు ఐదవ తేదీ నుండి 26వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె తెలిపారు. ఈ ఉద్యోగాలకు అర్హతలు పదవ తరగతి పాస్ అయి ఉండవలెను 25 నాటికి 21 సంవత్సరాలు నుండి 35 సంవత్సరాల లోపు వయసు కలిగిన వారే ఉండాలి స్థానిక వివాహిత మహిళ అయి ఉండాలి అవివాహితులు అనర్హులుగా తెలిపారు. అభ్యర్థులు మాత్రమే ఎస్సీ ఎస్టీ హాపీ టేషన్లోని పోస్టులకు ఎస్సీ మరియు ఎస్సీ అభ్యర్థులు మాత్రమే అర్హులని తెలిపారు. ఈ కేటగిరీలో పదవ తరగతి పాస్ అయిన వారు ఎవరూ లేనందువలన 8వ తరగతి పాస్ కూడా పరిగణలోకి తీసుకోబడుతుందని ఆమె తెలిపారు కావున అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 26వ తేదీ సాయంత్రం లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు.

# సీపీఎం పార్టీ విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా

అనంతసాగరం, మేజర్‌న్యూస్ : విద్యుత్ చార్జీలు తగ్గించాలని, స్మార్ట్ విద్యుత్ మీటర్ లు రద్దు చేయాలని కోరుతూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం అనంతసాగరం విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించడం జరిగింది. విద్యుత్ ఏఈ సకాలంలో డ్యూటీకి హాజరు కాకపోవడంతో నిరసనగా విద్యుత్ ఏఈ ఖాళీ కుర్చీకి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు మండల కమిటీ సభ్యులు డాక్టర్ సుబ్బా రాయుడు మాట్లాడుతూ.. వివిధ రకాల పేర్లతో అదనపు కరెంట్ బిల్లులో మోతుతున్నారని వాటిని రద్దు చేసి కరెంట్ చార్జీలు తగ్గించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.విద్యుత్ రంగాని ప్రైవేటు పరంచేస్తూ అదానీ లాంటి కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వం విధానాలకు అమలు చేసేందుకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు తీసుకొచ్చారని అన్నారు. జగన్ ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లు పెట్టితే పగలగొటండి అని నారా లోకేష్ ప్రజలకు చెప్పారని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇళ్లకు, దుకాణాలకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు చాలా స్పీడ్ గా బిగిస్తున్నారని అన్నారు. లోకేష్ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం స్మార్ట్ మీటర్లు పెట్ట కూడదని అన్నారు. స్మార్ట్ మీటర్ల వలన విద్యుత్ చార్జీలు పెరిగిపోయాయని, స్మార్ట్ మీటర్ చెడిపోతే దాన్ని బాగుచేసి బాధ్యత విద్యుత్ అధికారులది కాదని మళ్ళీ 12000రూ పెట్టి అదానీ కంపెనీ వద్ద కొనుగోలు చేయాలని అన్నారు. స్మార్ట్ మీటర్ ల వలన ప్రజలు విద్యుత్ భారాలు తప్ప వినియోగదారులకు ఎలాంటి లాభం ఉండదని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ అనంతసాగరం మండల కార్యదర్శి అన్వర్ బాషా, సిపిఎం మండల కమిటీ సభ్యులు ఉప్పలపాడు మస్తాన్, జక్రయ్య, కనగాల శీను, వెంకటేష్, నరసింహులు, మీరా మొహిద్దిన్, గౌస్ బాషా, ఇష్ఫఖర్, బాబు, రవి, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు




మర్రిపాడు, మేజర్‌న్యూస్ : మర్రిపాడు మండలంలోని చుంచులూరు మరియు పడమటినాయుడుపల్లి గ్రామాలలో మంగళవారం శాస్త్రవేత్తలు సందర్శించారు. నెల్లూరు జిల్లా ఆత్మ యాజమాన్య సౌజన్యంతో ఉదయగిరి సహాయ వ్యవసాయ సంచాలకులు జి లక్ష్మీ మాధవి ఆధ్వర్యంలో పొదలకూరు వ్యవసాయ పరిశోధన స్థానం నుంచి సీనియర్ శాస్త్రవేత్తలు సురేఖ, హసీనాభాను పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో చుంచులూరు గ్రామంలో వేరుశనగ సజ్జ పొలాలను సందర్శించారు. వేరుశనగలు రసం పిలిచే పురుగులను గుర్తించారు. దీని నివారణకు ఇమిడాక్లోప్రిడ్ లీటర్‌కి 0.4గ్రాములు (80ఎంఎల్, ఎకరాకి)ను వేప నూనె తో కలిపి పిచికారి చేయాలని తెలిపారు. అలాగే ఆకులు పోషకాహార లోపం ఉన్నందున ఫార్ములా లీటర్‌కి 4 నుండి 5 గ్రాములుకి పిచికారి చేయాలి అని తెలిపారు. మరియు సజ్జ పంటలు కత్తెర పురుగును గమనించడం జరిగింది. దీని నివారణకు ఇమమెక్టిన్ బెంజోటే 80ఎంఎల్, ఎకరాకి)తో వేప నూనె కలిపి పిచికారి చేసుకోవాలని తెలిపారు. వేరుశనగలో 40 రోజులకు కలుపు నివారణ చేసేటప్పుడు ఎకరాకు 200 కేజీలు జిప్సం ను చల్లి నట్లయితే దిగుబడి బాగా వచ్చే అవకాశం ఉంటుందని తెలియజేశారు. ఈ సందర్భనకు మండల వ్యవసాయ అధికారి ఎన్.కవిత, మండల విస్తరణ అధికారి వెంకటేశ్వర్లు, గ్రామ వ్యవసాయ సహాయకులు మల్లెం కొండయ్య, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే సమీక్ష సమావేశం




నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ : నెల్లూరు రూరల్ మండలంలోని సౌత్ మోపూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో వైద్యాధికారి డాక్టర్ పి.రవీంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆశా డే సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఆశా డే సమావేశంలో తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమం గురించి మరియు జాతీయ నులి పురుగుల దినోత్సవం గురించి వైద్య ఆరోగ్య సిబ్బందికి సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆగస్టు 12వ తేదీన 1 నుండి 19 సంవత్సరాల వయసు గల పిల్లలందరికీ ఆల్బెండజోల్ 400ఎంజి మాత్రలు ఇవ్వవలెనని తెలియజేయడం జరిగింది. ఇతర కారణాల వలన ఎవరైనా పిల్లలు 12వ తేదీన ఆల్బెండజోల్ మాత్ర వేసుకొని పక్షంలో వారికి ప్రత్యేకంగా ఆగస్టు 20వ తేదీ మరో మారు ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వవలసి ఉన్నదని తెలియజేసినారు. ఆశా కార్యకర్తలకు సంబంధించిన ఈ ఆశ యాప్‌లో అన్ని పారామీటర్స్ సక్రమంగా నమోదు చేయవలెనని సూచించడం జరిగింది. ఆర్‌సిహెచ్‌కి సంబంధించి పారామీటర్‌లను సక్రమంగా నమోదు చేయవలెనని తెలియజేయడం జరిగింది. ఈ సమావేశంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బట్టేపాటి అశోక్, ఎంపిహెచ్ఈఓ బి.పెంచలయ్య, హెల్త్ సూపర్వైజర్లు షైక్. రహుల్, బి.రామారావు, ఎంఎల్‌హెచ్‌పిలు ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మూలాపేటలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

▸ 13న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి పర్యటన విజయవంతం చేయాలి



నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ : మూలాపేటలో స్పీడ్ బ్రేకర్లు లు ఏర్పాటు చేయాలని బిజెపి మండల కమిటీ డిమాండ్ చేసింది నెల్లూరు మూలపేట బిజెపి మండల శాఖ 39 నుండి 45 డివిజన్ల సమావేశం జరిగింది. 13వ తేదీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పర్యటన విజయవంతం చేయడం కోసం చర్చించారు. ఈ సమావేశాన్ని ముఖ్య అతిథులుగా కందికట్ల రాజేశ్వరమ్మ. మిడతల రమేష్. యశ్వంత్ సింగ్ లుగా పాల్గొన్నారు. కోనేటి మిట్ట లోనికి వెళ్లే మార్గంలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి. శివగిరి కాలనీలోకి ప్రవేశించే మార్గానికి రెండు వైపులా వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి సమావేశం సందర్భంగా విజ్ఞప్తి చేశారు. మండలాధ్యక్షుడు పద్మావతి ప్రధాన కార్యదర్శి లు ఏవి సుబ్బయ్య. మనోశ్రావ్య. నాగేంద్ర సింగ్. ఆఫీస్ బ్యానర్స్ చంద్ర. వీర రాఘవులు. టి శ్రీనివాసులు. శ్రీకృష్ణ .భాస్కరు. శిరీష తదితరులు పాల్గొన్నారు.

## కామన్ క్యాన్సర్లపై అవగాహన



నెల్లూరు, మేజర్‌న్యూస్ : జిల్లాలో ఎన్‌సిడీ 4.0 హౌస్‌హోల్డ్ సర్వేను విజయవంతంగా చేపట్టడానికి ముందస్తు ఏర్పాట్లలో భాగంగా, కామన్ క్యాన్సర్లు (ఓరల్, సర్వికల్, బ్రెస్ట్ క్యాన్సర్లు)పై అవగాహన కల్పించేందుకు జిల్లాస్థాయి మాస్టర్ ట్రైనర్లకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమంను ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి వి.సుజాత పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్, సిహెచ్‌సి స్థాయిలో ఎంపికైన వైద్యులు, హెల్త్ ఎడ్యుకేటర్లు, ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో క్యాన్సర్ ప్రాథమిక స్క్రీనింగ్, ఇంటి వద్ద సర్వే నిర్వహణ విధానం, ప్రజలతో సంభాషణలో అనుసరించాల్సిన జాగ్రత్తలు, డేటా నమోదు తదితర అంశాలపై శిక్షణ ఇవ్వబడింది. ఈ శిక్షణ అనంతరం టిఓటి ఎస్ తమ తమ మండలాల్లోని ఫీల్డ్ సిబ్బందికి శిక్షణను అందించనున్నారు. ఇది గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సాధారణ క్యాన్సర్లను తొందరగా గుర్తించేందుకు, ప్రజలలో ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకు దోహదపడుతుంది.

## అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు

అనంతసాగరం, మేజర్‌న్యూస్ : మండలం సోమశిల గ్రామంలోని బిసి అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం సూపర్వైజర్ శారదా ఆధ్వర్యంలో తల్లిపాలు వారోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సూపర్వైజర్ శారద మాట్లాడుతూ.. తల్లులు పరిశుభ్రత పాటించి పాలు ఇవ్వాలని ఆమె అన్నారు. పుట్టిన పిల్లలకు తల్లుపాలు ఇవ్వడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు గుడిపాటిపద్మావతి, గువ్వల విజయలక్ష్మి, సుంకర బుజ్జమ్మ, బల్లి రాములమ్మ, తులసి, అంగన్వాడి హెల్పర్స్, తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 13వ తేదీన పాతాళపల్లి చెరువు వేలంపాట

అనంతసాగరం, మేజర్‌న్యూస్ : మండలం పాతాళపల్లి గ్రామంలోని గ్రామ సర్పంచ్ బిజివేముల ఓబుల్ రెడ్డి అధ్యక్షతన డిప్యూటీ ఎంపీడీవో రామచంద్రయ్య సమక్షంలో ఈనెల 13వ తేదీ చేపల చెరువుకు వేలంపాట నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు మంగళవారం తెలిపారు. ఈ పాటలో పాల్గొనేవారు పదివేల రూపాయలు ధరావత్తు చెల్లించి పాల్గొనాలని తెలిపారు. మూడు లక్షల 50 వేల రూపాయలు చెరువు వేలం పాట నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. వేలంపాట పూర్తయిన వెంటనే చెరువును పాడుకున్నవారు 25శాతం నగదు చెల్లించాలని రెండు వారాల తర్వాత 75శాతం నగదు చెల్లించాలని ఆయన తెలిపారు. మధ్యాహ్నం రెండు 30 నిమిషాలకు గంటలకు గ్రామ సచివాలయంలో వేలంపాట జరుగుతుందని తెలిపారు.

# రైతులు తప్పకుండా ఈక్రాప్ నమోదు చేసుకోవాలి : ఎంఏఓ







**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** రైతులు తాము సాగుచేసిన పంటలకు తప్పకుండా ఈ'క్రాప్ నమోదు చేయించుకోవాలని ఆత్మకూరు మండల వ్యవసాయాధికారి కె.కిషోర్‌బాబు కోరారు. మంగళవారం ఆయన ఆధ్వర్యంలో మండలంలోని చెర్లోయవల్లి, మురుగుళ్ళ గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రెండు గ్రామాల్లో సదస్సులు నిర్వహించారు. పొలాల్లో రైతులు, అధికారులు క్షేత్రపరిశీలన గావించారు. ఈ సందర్భంగా కిషోర్ బాబు మాట్లాడుతూ.. రైతులు తమ సమీపరైతు సేవాకేంద్రంలో తప్పకుండా తమ సిబ్బంది ద్వారా ఈక్రాప్‌నమోగు చేయించుకోవాలని సూచించారు. తమ సిబ్బంది పొలాల్లో పంటను పరిశీలించిన అనంతరం ఇక్రాప్ నమోదు చేస్తారన్నారు. అన్నదాతసుఖీభవ, పిఎంకిసాన్ యోజన, ధాన్యంకొనుగోలు, పంటనష్ట సరిహారం, పంటలభీమా, తదితర పథకాలు తప్పకుండా వర్తిస్తాయని ఆయన వివరించారు. పొలాలను పరిశీలించిన సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. అధికంగా రసాయనిక ఎరువులు, పురుగుల మందులు వాడరాదని సూచించారు. పైరులో ఎక్కువగా వేరుకుళ్ళు ఉన్నట్లు గుర్తించారు. దాన్ని అరికట్టేందుకు లీటరునీటికి 2.మి.లీ హెకాకోనోజోల్ లేదా 1మి.లీ ప్రోపికోనాజోల్ మందులు కలిపి పైరు పై పిచికారీ చేయాలని సూచించారు. రైతులు పంటలయాజమాన్య పద్ధతులగురించి ఆయన వివరించి అందరూ ఆచరించాలని, తద్వారా అధికదిగుబడులు సాధించవచ్చని, నాన్యమైన ఉత్పత్తులు లభిపస్తాయని ఆయన పేర్కొన్నారు. నాణ్యమైన ఉత్పత్తులకు గిట్టుబాటుధర కూడా అభిస్తుందని కిషోర్‌బాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విఏఏలు వి.ప్రత్యుష, ఎస్‌కె బీబీఅయేషా, చెర్లోయడవల్లి, మురుగుళ్ళ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కళాకారులకు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** రంగస్థల, జానపద, పండిరిభజనల, తోలుబొమ్మలాటల, వీధిభాగవతంల కళాకారుల సంక్షేమాన్ని గత ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన తెలుగుదేశం ప్రభుత్వమైనా తగు చర్యలు తీసుకోవాలని, ప్రత్యేకంగా సంక్షేమ కార్యక్రమాలు అమలుచేయాలని ఆత్మకూరు ప్రాంతంలోని కళాకారుల సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు. గత ప్రభుత్వం వద్ద ఎంతగా మొరపెట్టుకున్నా వృద్ధకళాకారులకు పెన్షన్లు, ఆర్టీసీబస్సుల్లో రాయితీ, కళాకారులకు గుర్తింపుకార్డుల మంజూరు, దేవాలయాల్లో, ఆధ్యాత్మిక కేంద్రాల్లో ప్రదర్శనలకు అవకాశం ఇవ్వకపోగా రంగస్థల వృత్తికళాకారులకు బ్రతుకుదెరువుగా ఉన్న చింతామణి నాటక ప్రదర్శనను నిషేధించారని వారు ఆవేదనతో తెలిపారు. గతంలో 15సంవత్సరాల క్రితం నెల్లూరు జిల్లాలో 560మందికి మాత్రమే వృద్ధకళాకారుల పెన్షన్ మంజూరు చేశారని, అనంతరం ఎంతగా మొరపెట్టుకున్నా 60సంవత్సరాలు దాటిన అర్హులు వందలాదిమంది ఉన్నా వారికి పెన్షన్ మంజూరు చేయలేదన్నారు. చింతామణినాటక ప్రదర్శనపై విధించిన నిషేధం రద్దుచేయాలని అరిచిగీపెట్టినా గత ప్రభుత్వం ఏమాత్రం పట్టిచుకొనకుండా పెడచెవిన పెట్టిందన్నారు. కళాకారులకు గుర్తింపుకార్డులంటూ దరఖాస్తున్న స్వీకరించిన గత ప్రభుత్వం కార్డులివ్వనేలేదన్నారు. వయసుమీరిన అర్హులైన కళాకారులకు పెన్షన్లు మంజూరుచేయాలన్నా జిల్లాపౌరసంబంధాలశాఖకు దరఖాస్తులు చేసే అవకాశం కూడా గత ప్రభుత్వం ఇవ్వలేదని వారు ఆవేదనతో తెలిపారు. గుర్తింపు కార్డులుంటే ఏదేని ప్రదర్శనలకు వెళ్ళే సమయంలో ఎవరూ అడ్డుకొనకుండా ఉంటుందని భావించినా ఆకార్డులు ఇవ్వలేదన్నారు. ప్రదర్శనలకోసం వివిద ప్రాంతాలకు ప్రయాణాలు చేయాల్సి ఉన్నందున ఆర్టీసీ బస్సుల్లో రాయితీ ఇవ్వాలని కూడా కోరినా పట్టించుకోలేదన్నారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా కళాకారుల వృత్తి ప్రాధాన్యతగా అర్హులందరికీ పెన్షన్లు మంజూరు చేయాలని, అందరు కళాకారులకు గుర్తింపు కార్డులివ్వాలని, ఆర్టీసీ బస్సుల్లో రాయితీ ఇవ్వాలని, కళాప్రదర్శనలే వృత్తిగా నమ్ముకొని సరైన అవకాశాలు లేక ఇబ్బందిపడుతున్నందున కళాకారుల ప్రదర్శనలకు దేవాలయాలు, ధార్మికసంస్థల్లో అవకాశం కల్పించాలని వారు నేటి ప్రభుత్వాన్ని కోరుతున్నారు. తామూ ప్రజలమేనని, ఓటర్లమేనని, తాము కూడా ప్రజాప్రతినిధులను ఎన్నుకున్నామని, అన్నివర్గాల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలుచేస్తున్న ప్రభుత్వం కళాకారులను కూడా ఆదుకోవాలని, తమ సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని వారంతా కోరుతున్నారు.

- అటకెక్కిన విచారణ
- పట్టించుకోని అధికారులు
- కోట్లవిలువగల భూమికబ్జా

# శాంతినగర్‌లో ఆక్రమణలజోరు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో ఆక్రమణకు అడ్డుఆపూ లేకుండా ఉంది. రోడ్డు, తిప్ప, వాగు పోరంబోకు స్థలాలు యధేచ్ఛగా ఆక్రమించుకొని పెద్దపెద్ద నిర్మాణాలు చేయడం తెల్సిందే. కాగా మున్సిపల్ పరిధిలోని శాంతినగర్‌వద్ద నాలుగేళ్ళుగా యధేచ్ఛగా ఆక్రమణల పర్వం సాగుతుండగా అధికారులు పట్టించుకోవడం లేదు. కొందరు అధికారులే ఆక్రమణదారులకు అండగా ఉన్నారన్న ప్రచారం సాగుతుండేది. ఇటీవల అక్కడ షాపింగ్‌కాంప్లెక్స్‌లు కూడా వెలిశాయి. కాగా 2022లో ఈ ఆక్రమణల పర్వంగురించి మేజర్‌న్యూస్ ప్రచురించగా అప్పటి ఆర్డీవో చైత్రవర్షిణి స్పందించి 20మంది సిబ్బందిని నియమించి సర్వేచేయించి నివేదికలు తెప్పించారు. అక్కడ గతంలో 116 ప్లాట్లతో పభుత్వం లేఅవుట్ వేసి దాదాపు 70మందికి పట్టాలిచ్చారని చెబుతుండేవారు. లేఅవుట్‌కు ఆవల కూడా స్థలాలుండేవి. కాగా 12మంది మున్సిపల్ సిబ్బంది శాంతనగర్ లేఅవుట్‌కు ఆవల స్థలాలు ఆక్రమించుకొని చిన్నపాటి రేకుల ఇళ్ళు నిర్మించారు. వారిలో ఒక్కరు మాత్రమే అర్హులని, మిగతా వారు పట్టాలిచ్చేందుకు కూడా అర్హులు కాదంటూ ఆర్డీవో నిర్ధారించగా తహశిల్దారు వారికి నోటీసులు కూడా ఇచ్చారు. అయినా వారు ఖాతరుచేయకపోగా వాటిని తొలగించే చర్యలు చేపట్టలేదు. మరికొందరు నాటి అధికారనేతల సహకారంతో స్థలాలను ఆక్రమించుకున్నారు. కొందరైతే రెండేసి, మూడేసి స్థలాలు కూడా ఆక్రమించుకున్నారని, కొందరు విక్రయించారని పలవురు చెబుతుంటారు. ఈవిషయమై అధికారుల దృష్టికి వెళ్ళినా పట్టించుకోలేదని పలువురు చర్చించుకుంటుండగా అధికారులు విచారణ జరిపినా ఎలాంటి చర్యలు లేవు.. కోట్లాదిరూపాయల విలువగల ప్రభుత్వ స్థలాలను యధేచ్ఛగా ఆక్రమించుకుంటున్నా, అదీగాక మున్సిపల్, రెవిన్యూ, హౌసింగ్ సిబ్బంది ఆక్రమించుకున్నా, నిర్మాణాలు సాగించినా బినామిపేర్లు అని ప్రచారం జరుగుతున్నా అధికారులు మాత్రం ఏమాత్రం స్పందించకుండా మౌనం దాల్చారు. ఇంతగా విచ్చలవిడి ఆక్రమణలపట్ల అధికారయంత్రాంగం స్పందించకపోవడం పలు సందేహాలకు తావిచ్చే పరిస్థితి ఏర్పడింది. ఇంతటి దోపిడీ వ్యవహారం ఆత్మకూరులో సాగుతుందని, మరెక్కడా ఇలాంటి విచ్చలవిడి పరిస్థితి ఉండబోదని ,నాటి ప్రభుత్వంలోని వారే విపరీతంగా ఆక్రమించుకోవడం, అత్యంత విడ్డూరంగా ఉందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. మరి ఖచ్చితంగా వ్యవహరించే ఆత్మకూరు ఆర్డీవో స్పందించి సమగ్రంగా విచారణ,సర్వే చేయిస్తే వాస్తవాలన్నీ వెల్లడికాగలవని కూడా వ్యాఖ్యానిస్తున్నారు. మరి చర్యలకు పూనుకుంటారేమో చూడాల్సి ఉంది.

## తల్లిపాలు బిడ్డలకు అమృతంతో సమానం : శ్రీదేవి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** తల్లిపాలు బిడ్డలకు అమృతంతో సమానమని ఆత్మకూరు ఐసిడిఎస్ సూపర్‌వైజర్ డి.శ్రీదేవి పేర్కొన్నారు. స్థానిక ఐసిడిఎస్ సిడిపివో పి.సునీలత ఆదేశాల మేరకు మంగళవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఆత్మకూరు మండలంలోని పాత జంగాలపల్లి ఎస్‌సికాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రత్యేక అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మినరసమ్మ ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శన ఏర్పాటు చేయగా ఆమె పరిశీలించారు. అనంతరం ఏర్పాటుచేసిన సదస్సులో గర్భిణీలు, బాలింతలు, మహిళలకు తల్లిపాల విశిష్టతనుగురించి శ్రీదేవి వివరించి అవగాహన కల్పించారు. బిడ్డపుట్టినపుడే తల్లి తన ముర్రుపాలను ఇస్తే ఆ బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందని, రోగనిరోధక శక్తి పెరుగుతుందని, బిడ్డ ఆరోగ్యంగా పెరుగుతారని ఆమె వివరించారు. తల్లిపాల వినియోగంలో ఎలాంటి అపోహలకు అవకాశం లేదని, తప్పకుండా బిడ్డలకు తల్లులే తమ పాలను ఇవ్వాలని ఆమె సూచించారు. గర్భిణీలు అంగన్‌వాడీ కేంద్రాలద్వారా సమకూరే పౌష్టికాహారంతోపాటు తమకు అందుబాటులో ఉన్న పోషకవిలువల సమతుల ఆహారం తీసుకుంటే సమృద్ధిగా పాలు లభిస్తాయని, తమకు పుట్టే బిడ్డలకు ఆపాలు ఎంతో శ్రేష్టమని ఆమె పేర్కొన్నారు. గర్భిణీలు, బాలింతలు తప్పకుండా తల్లిపాల ప్రాధాన్యత, ప్రయోజనాలగురించి తగిన అవగాహన పెంపొందించుకోవాలని, తగిన చైతన్యంతో పుట్టే బిడ్డలకు తమ పాలనే ఇవ్వాలని శ్రీదేవి కోరారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మినరసమ్మ, పలువురు గర్భిణీలు, బాలింతలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## రైతుసంఘ నాయకులను అరెస్ట్ అన్యాయం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** కరేడు భూములను ప్రభుత్వం సేకరించడాన్ని వ్యతిరేకించే రైతుసంఘ నాయకులను పోలీసులు అరెస్ట్ చేయడం అత్యంత అన్యాయమని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆత్మకూరు మండల ప్రధాన కార్యదర్శి లక్కు కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం కరేడు రైతులను పరామర్శించేందుకు ఆత్మకూరునుండి వెళుతున్న నెల్లూరు జిల్లా రైతు సంఘ ప్రధానకార్యదర్శి మూలివెంగయ్య, వ్యవసాయకార్మికసంఘ జిల్లా ప్రధానకార్యదర్శి మంగళ పుల్లయ్య, స్థానిక నాయకుడు కుమార్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. బాధితులను పరామర్శించడం కూడా నేరంగా పరిగణించడం దారుణంగా ఉందని, ఈఅరెస్ట్‌లను తమ రైతు సంఘం ఖండిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. పంటలుపండించు కునే భూములను బలవంతంగా సేకరించాలని చూడడం చట్టవిరుద్ధంగా ఉందన్నారు. ఇందులో ఏదో పెద్ద కుట్రదాగి ఉందని సందేహం వ్యక్తం చేశారు. పోలీ సులు రైతుల నిర్బంధ విధానాన్ని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

## తల్లిపాల ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన, ర్యాలీ

**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** ప్రతి సంవత్సరం ఆగష్టు1వ తేది నుండి 7వ తేది వరకు జరుగు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా మంగళవారం నాడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్, నెల్లూరు అర్బన్ పరిధిలో జిల్లా స్థాయిలో బారీ ర్యాలి నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలి ఆర్‌టిసి బస్టాండ్ నందు సర్వోదయ కాలేజీ నుంచి బయలుదేరి తల్లి పాల యొక్క ప్రాముఖ్యతను తెలియచేస్తూ కెవిఆర్ పెట్రోల్ బంక్ వరకు కొనసాగింది. ర్యాలి అనంతరం మహిళా ప్రాంగణం నందు మీటింగ్ ఏర్పాటు చేసి తల్లిబిడ్డల ఆరోగ్యం కోసం తల్లి పాలకు మద్దతునిచ్చే స్థిరమైన వ్యవస్థలను ఏర్పాటు చేసి తల్లి పాల సంస్కృతి ప్రోత్సాహానికి ప్రాదాన్యత ఇవ్వాలనీ, బిడ్డ పుట్టిన గంటలోనే తల్లిపాలు త్రాగించాలని తల్లి పాలే బిడ్డకు తొలి టీకా అనీ, తల్లి పాలు ఇవ్వడం వలన బిడ్డకే కాదు తల్లికి కూడా శారీరకంగా, మానసికంగా, ఆర్ధికంగా రక్షణ లభిస్తుందనీ ,తల్లిపాలలో వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉన్నందున డయేరియా, నిమోనియా వంటి వ్యాధులు రాకుండా ఉంటాయనీ అలాగే రొమ్ము క్యాన్సర్, అండాశయ క్యాన్సర్ రాకుండా ఉంటాయని, ఎటువంటి శ్రమ, ఖర్చు లేకుండా వుండే తల్లిపాలను బిడ్డకు 6 నెలల వరకు ఖచ్చితంగా తల్లిపాలు మాత్రమే త్రాగించాలని సలహా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంకు ముఖ్యఅతిధిగా జిల్లా స్త్రీ శిశు సంక్షేమ, సాధికారిత అధికారిణి బి.హేనాసూజన్, డిఎంహెచ్ఓ, డిఐఓ ఉమామహేశ్వరీ, నెల్లూరు జిల్లా సిడిపిఓలు, మెడికల్ ఆఫీసర్ దీనా భారతి, సూపరువైజర్లు, అంగన్ వాడి కార్యకర్తలు, ఆయాలు, ఏఎన్ఎమ్లు, ఆశావర్కర్లు తల్లులు, గర్భవతులు, బాలింతలు తదితరులు పాల్గొనడం జరిగింది.



# చిరమనలో పోలేరమ్మను దర్శించుకున్న మంత్రి ఆనం



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేట మండలంలోని చిరమణ గ్రామంలో రెండు రోజుల క్రితం శ్రీ పోలేరమ్మ తల్లి శిలా ప్రతిష్ట, కుంభాభిషేకం మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సందర్శించి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు టిడిపి నియోజకవర్గ నాయకులు కాటంరెడ్డి రవీంద్రారెడ్డి గ్రామ నాయకులు కాటంరెడ్డి నరసింహారెడ్డి గ్రామస్తుల ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమానికి మంత్రి ఆనం విచ్చేశారు. ఈ సందర్భంగా పూజారులు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చేతుల మీదుగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీ పోలేరమ్మ అమ్మవారి ప్రాచీనత గ్రామ దేవతగా ఆమెకు ఉండే విశిష్టత గ్రామ అభివృద్ధిలో ఆధ్యాత్మికతను ఉన్న ప్రాధాన్యతను ఆనం రామనారాయణ రెడ్డికి వివరించారు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ.. రెండు రోజుల క్రితం చీరమనగ్రామంలో జరిగిన శ్రీ పోలేరమ్మ తల్లి శిలా ప్రతిష్ట కార్యక్రమం జరిగిందని కొన్ని అనివార కారణాలవల్ల రాలేకపోయాను అని తెలిపారు అయితే మంగళవారం నాడు గ్రామంలోని పోలేరమ్మ తల్లి రూపాన్ని దర్శించుకుని ఆశీస్సులు తీసుకోవడం జరిగిందని తెలిపారు. గ్రామ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణని శాలువాలు కప్పి పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు కంచర్ల శ్రీహరి నాయుడు మండల నాయకులు ఏలూరి మాలాద్రి నాయుడు షేక్ జిలాని భాష గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. ఏఎస్ పేట ఎస్ఐ ఏ.సైదులు బందోబస్తు నిర్వహించారు

# గణేష మండపాలకు ఉచిత కరెంటు ఇవ్వాలి



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరులోని వినాయక చవితి గణేష మండపాలకు ఉచిత కరెంట్ ఇవ్వాలని విద్యుత్ శాఖ ఏపీ ఎస్పీడీసీఎల్ నెల్లూరు సూపరింటెండెంట్ ఇంజనీరును గణేష్ ఉత్సవ సమితి నిర్వాహకులు కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నెల్లూరు నగరంలో పలు ప్రాంతాలలో ఆగస్టు 27వ తేదీ నుంచి 31వ తేదీ వరకు వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారని గణేష్ మండపాలకు ఉచిత కరెంటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే తాత్కాలిక గణనాధుల శోభాయాత్ర కోసం నగరంలోని పలు కూడళ్ళు నుంచి జరుగుతుందని వివరిస్తూ కరెంటు వైర్ల మీదుగా చెట్లు కేబుళ్లు ఉన్నాయని వాటిని విద్యుత్ శాఖ అధికారులు తొలగించి కరెంటు వైర్లను ఎత్తు చేయాలని కోరారు. దీనికి అధికారులు సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో విక్రమ్ సింహపురి గణేష్ ఉత్సవ సమితి గౌరవ అధ్యక్షులు పి.సత్య నాగేశ్వరరావు, గౌరవ సలహాదారులు పి.సురేంద్రరెడ్డి, అధ్యక్షులు కే శ్రీకాంత్, వేలూరు మహేష్, భాస్కర్ రెడ్డి, హర్షవర్ధన్, శ్రీనివాసులు రెడ్డి, సుందర్ రామిరెడ్డి, నారా శ్రీనివాసులు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# వైభవంగా అలఘునాధస్వామి మహాకుంభమేళా ప్రారంభం





**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** అత్యంత పురాతన చరిత్రకలిగి 1247లో నిర్మించబడి 12సంవత్సరాల క్రితం జీర్ణోద్ధరణగావించి అధునాతనంగా ఆకర్షిణీయంగా పునర్నిర్మించబడిన ఆత్మకూరులోని తూర్పువీధిలో శ్రీదేవి, భూదేవిసమేత శ్రీ అలఘునాధస్వామి ఆలయంలో అత్యంత వైభవంగా, కోలాహలంగా పుష్కరమహోత్సవ మహాకుంభాభిషేకం కార్యక్రమాన్ని మంగళవారం అంగరంగవైభవంగా భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. మూడురోజుల పాటు ఈకార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకుగాను ఆలయకమిటీ సభ్యులు ఆలయాన్ని ఆకర్షణీయంగా అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం అనేక ఏర్పాట్లు గావించారు. ఈసందర్భంగా స్వామి,అమ్మవార్లకు ప్రత్యేకంగా అలంకరణలు గావించి అభిషేకాలు,హోమాలు నిర్వహించారు. ఉదయం అనుజ్ఞగంగాయనం, గోపూజ, యాగశలప్రవేశం, విష్వక్సేన ఆరాధనం, భగవత్‌పుణ్యాహవచనం, రక్షాబంధనం, ఆచ్చార్యాధిరుత్విక్‌వరణము, పంచగవ్యప్రాశనం, వాస్తుపూజ, నవకలశస్థాపన, దేవేరులకు తిరుమంజనం, మహానివేదనం, మంగళహారతి, తీర్థప్రసాదవినియోగం



కార్యక్రమాలుంటాయని, సాయంత్రం ప్రదోషకాలపూజ, మృత్యుంగ్రహణం, అంకురార్పణ, ప్రవేశబలి, కుంభస్థాపన, అగ్నిప్రతిష్టాపన, మూలమంత్ర, హవనం, నైవేద్యం, మంగళహారతి, తీర్థప్రసాదవితరణం కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు విరివిగా హాజరై స్వామి, అమ్మవార్లను సందర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం భారీగా అన్నదాన కార్యక్రమం కంచిపరమేశ్వరరెడ్డిచే ఏర్పాటు చేశామరు. ఈ కార్యక్రమాలు శ్రీచండీ ఉపాసకులు, వాస్తు,జ్యోతిష,వైదిక ఆగమ పండితులు శ్రీ కంభలూరు మధుసూధనశర్మ, శ్రీ ఇనుపకుతిక నాగభూషణం, ఆలయ అర్చకస్వామి శ్రీ విశ్వనాథం శ్రీనివాసశర్మల ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయంత్రం కోలాటప్రదర్శనలు, సామూహికవిష్ణుసహస్రపారాయణం, శ్రీభారతీసంగీత,నృత్య విద్యాలయం విద్యార్థులతో నృత్యప్రదర్శనలు, అన్నమాచార్యసంగీత కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కుంభాభిషేకకమిటీ ప్రతినిధులు కె.వి.శేషారెడ్డి, కుడుముల సుధాకర్‌రెడ్డి, పి.సుధాకర్‌రెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


నేటి దినపత్రిక సూర్య

విలేకర్లు కావలెను

తెలుగు పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న నేటి దినపత్రిక సూర్య నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.

కావలసిన సెంటర్లు

నెల్లూరు జిల్లాలోని సంగం, కొడవలూరు, మనుబోలు, అల్లూరు, దగదర్తి, కొండాపురం, కలిగిరి, కలవాయి, విడవలూరు, ఇందుకూరుపేట, కోవూరు, నెల్లూరు పట్టణంలోని దర్గామిట్ట, స్టోన్ హౌస్‌పేట, బాలాజీ నగర్‌లలో విలేకర్లు కావలెను

మీ పూర్తి బయోడేటాతో వారంలోపు క్రింది చిరునామాలో సంప్రదించగలరు.

నేటి దినపత్రిక సూర్య కార్యాలయం

మిలటరీ కాలనీ, రోడ్ నెం.1,ఎల్ఐసి & సిఐడి ఆఫీసు ఎదురుగా, కొండాయపాలెం గేట్ సెంటర్, నెల్లూరు

9000118811, 9000483583


## పవిత్రోత్సవాలలో భాగంగా యాగశాల ప్రవేశం



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు మాగుంట లేఔట్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం శ్రీవారు యాగశాల ప్రవేశం జరిగింది. శ్రీవారి పవిత్రోత్సవంలో భాగంగా కుంభావాహనం, మండలవాహనం, అగ్ని ప్రతిష్ట, యాగశాల ప్రవేశం నిర్వహించారు. శ్రావణ శుద్ధి ఏకాదశి సందర్భంగా దేవస్థానం నందు శ్రీ వారి కళ్యాణోత్సవం జరిగింది. ఈ వేడుకలో భక్తులు విశేషంగా పాల్గొని స్వామి వారి కళ్యాణోత్సవం చూసి తరించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

## ఆనం దంపతులను కలిసిన నేదురుమల్లి



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మని, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్ రెడ్డిని నెల్లూరు నియోజకవర్గ పరిధిలోని చింతా రెడ్డిపాలెం నందు వారి నివాసంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది.

## జమ్మలపాలెంలో అంధకారం

**జలదంకి, మేజర్‌న్యూస్ :** జమ్మలపాలెం రైతు సేవా కేంద్రం సమీపంలోని బజారులో విద్యుత్ బల్బులు లేక అంధకారం నెలకుంది. అలాగే పైప్ లైన్ లీకేజీతో త్రాగునీరు వృధాగా పోతున్న పంచాయతీ పాలకులు అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదని అక్కడి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై సోమవారం పంచాయతీ సెక్రటరీని వివరణ కోరగా విషయం తనకు తెలియదు అంటూనే, సమాచారాన్ని సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సర్పంచ్ సామాజిక మాధ్యమాలలో నూతనంగా వేస్తున్న స్థంభాల వలన పైప్ లైన్‌లు డ్యామేజ్ అయిందని, అలాగే బల్బులు పాత స్తంభాలకు తీసి వేశామని, కొత్త స్తంభాలకు త్వరితగతిన విద్యుత్ దీపాలు వేస్తామని వెల్లడించారు. ఇప్పటికే అరుంధతీయ వాడలోని కొత్త స్తంభాలకు లైట్లు వేశామని చెప్పుకొచ్చారు.